


# ఎంతెంత దూరం

కంచుమర్తి వెంకటేశ్వరరావు

బలరామయ్య నడుస్తున్నాడు.

ఎక్కడకో, ప్రశాంతమైన వాతావరణానికి చేరుకోవాలని తాపత్రయం ఆయనిది. కానీ అదెక్కడ ? అదే తెలియదు. తెలియనప్పుడు ఎక్కడవరకని వెళ్ళగలడు ? కూరగాయల మార్కెట్టు... మెయిన్ రోడ్డు... పార్కు... అన్నీ దాటుకుని వెళ్ళాడు. అవేవీ అతనికి ఆహ్లాదకరం కలిగించే ప్రదేశాలు కావని తెలుసు. అయినా నడుస్తున్నాడు.

రోడ్డు మలుపు తిరిగాడు.

ఎదురుగా కారు అతన్ని ముద్దెట్టుకోబోయి ఆగింది. డోర్‌లోంచి తల బయటపెట్టింది డ్రైవ్ చేస్తున్న అందమైన అమ్మాయి. ఆ అమ్మాయిని చూసాడు. పాలుగారే చెక్కిళ్ళు... బిగువైన పరువాలు. అవేవీ తను దాచడంలేనన్నట్లుగా ఒంటికి అమరిన బిగువైన పేంటు... చిన్న చొక్కా. ధనవంతుల పిల్ల.

''ఏయ్ బ్రతకాలని లేదా.''

నవ్వొచ్చింది బలరామయ్యకు. పసిపిల్ల. తన వయసులోని మూడోవంతు కూడా లేదు. తన వయసుకు ఎదగాలంటే ఇంకా నలభై ఏళ్ళు రావాలి. అప్పుడు తెలుస్తుంది ఈ ముసలి బ్రతుకు సార్థకత ఏమిటో ! బ్రతకాలని వుందో లేదో ! ఇంకా ఈ అరవై ఏళ్ళ వయసులో ఎందుకు బ్రతకాలో !

కారు వెళ్ళిపోయింది దుమ్మురేపి.

ఇందాక ఆ కారు తనను ముద్దెట్టుకుంటే తన గమ్యం చేరేవాడేమో. ఆ గమ్యానికి తనకూ ఎంత దూరం ? బెత్తెడు. ఆ బెత్తెడు దూరం కూడా చేరుకోలేక పోయాడు. అడుగులో అడుగు లేస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఆగిపోయాడు. ఇంటిదారి వచ్చింది. ఆ ఇంటిలోనే రెండు గంటల క్రితం ఈ భవ బంధాల నుండి విముక్తి చేయమని భగవంతుణ్ణి ప్రార్థించి మరీ బయటకు వచ్చాడు. ఎక్కడకో వెళ్ళాలని... తిరిగి తిరిగి మళ్ళీ ఇంటికే వచ్చాడు.

భూమి గుండ్రముగా ఉండును... నిజమే ననుకున్నాడు.

వరండాలో కూర్చున్నాడు. గదిలోంచి గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. ఆ గంటలు ఆ ఇంట్లో అతని భోజన సమయం గుర్తుకు చేస్తుంది. ఎక్కడున్నాసరే ఆ గంటలు కొట్టే టైముకు ఇంట్లో ఉండవలసిందే. భోజనమంటే ప్రేమకాదు. ఆకలేసి అంత కంటేకాదు. భోజనమంటే నవరసాలు కలిసింది కాదు అతని దృష్టిలో. అరవై ఏళ్ళు పైబడ్డ అతను డాక్టరు సలహామీద రైసు మానేసి రాత్రిళ్ళు పాలు, లేదా కాఫీ, బ్రెడ్డు తీసుకుంటున్నాడు. ఆ మాత్రానికే అంత టంచనుగా ఎందుకు ఎంటెండవ్వాలి. కోడలు పిల్లకు జడిసి. ''అయ్యో మామయ్యగారు మీకు లేటయింది'' అని కోడలుపిల్ల బాధపడుతుందనికాదు. ''అందరూ ఒకసారి వస్తే పని తెములుతుంది. తలోక టైముకు పనులు చెయ్యాలంటే నావల్ల కాదు'' అనే కోడలు విసుర్లు వినలేక.

''అమ్మాయి... కాఫీలో పంచదార లేదు.'' అడిగేడు.

''మీరు పంచదార వేసుకోకూడదు.''కోడలి సమాధానం.

పంచదార కలిపిన కాఫీ తనకు దూరం. ఈ దూరం డాక్టరు కొంత చెప్పితే తగ్గిందే చాలనుకుని అసలు తన కాఫీలో పంచదార కలపదు కోడలు. అలనాటయినా ఈ రోజు తీపి లేని కాఫీ త్రాగుతుంటే చేదుగాఉంది. అయినా బాధనిపించలేదు. గబగబ త్రాగేసాడు.

బలరామయ్య ఎప్పుడూ బాధపడలేదు. అయితే తనకు బాధలులేవా... బోలెడు. తనలో తనే బాధపడేవాడు. ఎందుకని... ప్రతిఘటించే ధైర్యం లేక. ధైర్యానికి అతనికి ఆమడ దూరం. ఆ ధైర్యం లేకపోవడంవల్లనే తిప్పలన్నీ తనే కోరి తెచ్చుకున్నాడు. చిన్నప్పటినుండి అంతే...

చిన్నప్పుడొకసారి ఆ ఊరి తిరునాళ్ళలో వీధిలో నాటకం జరుగుతుంది. ఇంట్లోవాళ్ళ అందరూ వెళుతుంటే తనూ వస్తానన్నాడు. అదసలే పౌరాణిక నాటకం... నీకు అర్ధంకాదు. అని నాన్న... మేము వచ్చేవరకు నాన్నమ్మదగ్గర పడుకొమ్మని అన్నయ్య చెప్పి వెళ్ళిపోయారు. నిజమేననుకున్నాడు. కానీ అర్ధం చేసుకుంటానని చెప్పలేదు. రేపో, మాపో చావడానికి సిద్ధంగా ఉన్న నాన్నమ్మ ప్రక్కలో పడుకున్నాడేగాని నిద్ర రావడంలేదు. మాటి మాటికి తుమ్ములు.. దగ్గులు... రొచ్చు వాసన. తలుపు చప్పుడైతే చాలు. ఓరేయ్ చూడరా... అని అతన్ని లేపి నిద్ర రానీయకుండా చేస్తుంది నాన్నమ్మ బాధగా ఉంది. అయినా అక్కడనుండి లేచి గదిలో పడుకుందామనే ఆలోచన రాలేదు.

ఇలా ఆలోచించకపోవడం ఈ ఒక్కసారే కాదు. ప్రతీ విషయంలోనూ అంతే. స్వంతగా ఆలోచించి ఏ నిర్ణయమూ తీసుకునే తత్త్వం కాదు బలరామయ్యది. అందరి మంచి చెడ్డలు కనుక్కొని ఒక నిర్ణయానికి రావాలి. మంచిదే. కానీ తనకంటూ కొన్ని సొంత విషయా లుంటాయి. వాటికోసమైనా ఆలోచించవచ్చు కదా ... ఈ అమాయకత్వం, మంచితనమే అతని సొంత నిర్ణయాలకు విలువలేకుండా చేసాయి ఆ ఇంట్లో.

పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. కాబోయే భార్య అందంగా ఉండాలి. చదువుకున్నదై ఉండాలి. అనుకున్నాడు. అనుకోవడంలో తప్పు లేదు.

"ఒరేయ్ ..అమలాపురం సోమసుందరంగారి అమ్మాయిని చూసాం. బాగుంది. నీకివ్వాలను కుంటున్నారు" అని నాన్న చెప్పినప్పుడు అమ్మాయి చదువుకుందా అని నోరు విడిచి అడిగాడు.

"ఎందుకురా అమ్మాయికి చదువు. నీతోపాటు ఉద్యోగం చెయ్యాలా ?"

నిజమేననుకున్నాడు. చాకలి పద్దులు, ఉత్తరాలు వ్రాయగలదట. పోనీలే అనుకుని సర్దిపెట్టుకున్నాడు.

స్వరాజ్యలక్ష్మి భార్యగ వచ్చింది.

అప్పటికి స్వరాజ్యం రాలేదు దేశానికి. సోమసుందరం దేశానికి స్వాతంత్ర్యం కావాలని పోరాడుతున్నరోజుల్లో, అడపాదడపా జైలు కెళ్ళినాడు. అప్పుడు అమ్మాయి పుట్టిందని స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టాడట.

దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. ఆడవాళ్ళకు




ఇది మీకు చాలా ఉపయోగం

మీకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తికొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకె లాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, చెడ్డవారితో ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధరూల్సు, వాటినుంచి రక్షణవివరాలు, మీరుతెలుసుకోదగిన అనేక చట్టాలవివరాలు, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదుల ఉత్తరాలు ఎలావ్రాయాలి, వాటివివిధ నమూనాలు అందున్నాయి సుమారు 300 పేజీలపుస్తకం. ధర రూ॥12. వి.పి. పోష్టుఖర్చు రూ॥3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం. 2, ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు-500890కు, మీఉపయోగానికి వ్యవహారధర్శిని పుస్తకం ఒకటి వి.పి పోష్టుద్వారా మీకు పంపించమనిసేడే ఉత్తరం వ్రాయండి



సరిక్రొత్త యవ్వనమునకు సంప్రదించండి



Dr RAI
(SEX SPECIALIST)

భారత ప్రఖ్యాత సెక్స్ స్పెషలిస్ట్ డా॥ రాయ్ (GOVT REGD)
30 సంవత్సరముల అనుభవముతో, వ్యక్తిగత, గుప్తరోగములకు, అసమానమైన, శాస్త్రీయమైన చికిత్స చేయుదురు జీవితములో ఆరోగ్యమునకు, యవ్వనమునకు ఆధునిక విద్యుత్ పరికరములతో ఉత్తమ చికిత్స చేయుదురు.

సమయం ఉదయం: 8-00 గం॥లనుండి 1-00 గం॥ వరకు
సాయంత్రం: 1-00 గం॥లనుండి 9-30 గం॥ వరకు

* ఆదివారం సెలవు లేదు *

రాయ్ మెడికల్ హాల్
సెయింట్ మేరీస్ రోడ్_మనోహర్ టాకీస్ ఎదురుగా
సికింద్రాబాద్........PHONE: 76795



ఒక్కోసారి తలనొప్పి మిమ్మల్ని అంతులేకుండా సాధిస్తుంది...




వదిలి వెళ్ళని మీ తలనొప్పిని జిందా బామ్‌తో వదిలించుకోండి




జిందా బామ్
మీ ఒంటి నొప్పులు, బెణుకులు, వాపులు అన్నిటిని నివారించేది, ఎదురులేనిది

## మనవి

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు తాము పంపే శీర్షిక పేరు రాసి కేరాఫ్ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగర్, విజయవాడ — 520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పూర్తి పేరు, చిరునామా యివ్వడం ఎంతైనా అవసరం. —సం.


## వధువు కావలెను

ప్రస్తుతము బెంగుళూర్‌లో స్థిరనివాస మేర్పరచుకుని జాతీయస్థాయిలో ఒక పరిశ్రమ నిర్వహిస్తున్న 34 సంవత్సరముల ఆంధ్ర సాంప్రదాయ ఆర్య క్షత్రియ ఇంజనీరు యువకునకు గుణవంతురాలైన అందమైన గ్రేడ్యుయేట్ వధువు కావలెను. కులప్రసక్తి లేదు. సాంప్రదాయ, ఆధునిక భావాలుగల బ్రాహ్మణ కుటుంబములకు ప్రాధాన్యత ఈయబడును. పూర్తి వివరములు, ఫొటోతో ఈ దిగువ చిరునామాకు వ్రాయగలరు.

బాక్సు నెం. W210
C/o. ఆంధ్ర సచిత్రవారపత్రిక,
విజయవాడ–3.



**7 8 6**

అల్లా పలు రోగాల్ని, వాటికి నివారణలను కూడ సృష్టించాడు (పి.ఎస్.)

ఉబ్బసము, ఇస్నోఫీలియా, రొమ్ము పడిశం (ఎన్నిరోజులనుంచి వున్నను), మూర్ఛ—ఫిట్సు, మొలలు మొదలైనవానికి అద్భుతమైన గ్యారంటీ చికిత్స.
నిస్సత్తువను మొదటి మోతాదు మందు సేవించినంతనే తొలగించును.

సంప్రదించండి :
**ఆస్తమా క్యూర్ సెంటర్,**
వార్డు నెం. 23 ఎదుట, మున్సిపల్ ఆఫీసు, షాలిబండ రోడ్, సయ్యద్ అలీ చబుత్ర,
హైదరాబాద్ - 500 265.
(ఆర్.టి.సి బస్సు రూటు నెం. 85)
సంప్రదించు వేళలు :
ఉ. 6–00 నుంచి మ. 12–00 గం.
సా. 4–00 నుంచి రా. 9–00 గం.


## ఎంతెంత దూరం

కూడా రాలేదు. ఆడవాళ్ళను వంటింట్లోను, పడగ్గదిలోను ఉంచేవారు. ఇంట్లో ఏం జరగాలన్నా, జరుగుతున్నా మగవారే నిర్ణయాలు తీసుకుని తర్వాతే ఆడవాళ్ళకు చెప్పేవారు. అటువంటప్పుడు కూడా అధికారం చెలాయించే వాడుకాదు బలరామయ్య. అధికారం చెలాయించడమంటే భయం. అధికారానికి అతనికి అంత దూరం.

వంకాయ కూరలో ములక్కాడలు వేసి వండు అని ఒక్కసారంటే "ఎందుకండి దూబరా ... రెండు కూరలు వేరు వేరుగా వండితే రెండు పూటలు వస్తాయి" అని స్వరాజ్యలక్ష్మి అంటే అలాగా అని ఊరుకున్నాడే తప్ప తనకిష్టమైన వంకాయ, ములగకాడ కూర వండించుకుని తినలేకపోయాడు.

స్వరాజ్యలక్ష్మి వరుసగానలుగురమ్మాయిలను, అబ్బాయిని కన్నది. అమ్మాయికి అమ్మాయికి మధ్య అమ్మాయిలకు అబ్బాయికి దూరం. అమ్మాయిలు పెళ్ళికెదిగేసరికి దేశానికి స్వాతంత్ర్యం, మగవాళ్ల రేట్లు, సినిమాలు, షికార్లు, పుకార్లు అన్నీ వచ్చేసాయి. ధరలు, బస్సులు, రైళ్ళు, ఆఫీసుల్లో ఫైళ్ళు అన్నీ పెరిగిపోయాయి. ఫైళ్ళు చేతులు మారాలన్నా, ఫైళ్లలోని కాగితాల మీద కలం పడాలన్నా రేట్లు వచ్చేసాయి. సీటు ఉండాలన్నా, సీటు పెరగాలన్నా, రేటున్న సీటుకు స్టిక్కరవ్వాలన్నా కాకాలు, బాకాలు కూడా అమలులోకి వచ్చాయి.

ఇన్ని మార్పులు, చేర్పులు, వింతలు, విడ్డూరాలు లోకంలో జరిగిపోతున్నా బలరామయ్య మాత్రం నిజాయితీ అనే కుర్చీలోనే కూలబడి ఉన్నాడు. లెగవయ్యా బాబూ...కాస్తంత కళ్లు తెరు...జేబులు నింపు ... బాగుపడతావ్ ... అని అప్పడే ఆ విషయంలో లోకజ్ఞానం సంపాదించి సంపాదన మొదలుపెట్టిన వాళ్లు పోరుపెట్టారు. అయినా చలించలేదు. అవినీతికి అతనికి అంత దూరం.

అమ్మాయిలు ఎదిగారు...తన వాటా ఆస్తి అమ్మి ఇద్దరమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసాడు. మిగిలిన ఇద్దరమ్మాయిల పెళ్లిళ్లు, అబ్బాయి చదువు రోజులు మారేకొలది బరువుగా తోచింది.

"ఏమండీ ... కాస్త మీరు మారండి ... నాలుగుడబ్బులు సంపాదిస్తే పిల్లలకు మిగిల్చిన వాళ్లవుతారు."

చదువురాని, నోటంటే మాటలే రాని, వంటింట్లోంచి బయటకు కదలని స్వరాజ్యలక్ష్మి అలా అడిగేసరికి ... ఆహా ... ఎంత మహిమ ... ఏమిటి ఈ మార్పు ... అలా అనుకున్నాడే గాని చలించలేదు బలరామయ్య.

"మీరు నీతి, న్యాయమంటూ మడి కట్టుకుని కూర్చున్నారు. అందరిలా మీరు సంపాదిస్తే నేను డాక్టరయ్యేవాడిని."

## బ్రతుకు తెరువు

ఆనాడెప్పుడో
కడుపు నిండేక
కాలక్షేపానికి
చేసిన "భజన"
ఈనాడు
చాలామందికి
గ్రాసయోగ్యమైంది !
అందుకే అంటారు
నేర్చుకున్నదేది
వృధాకాదని
పెద్దల మాట
చద్దన్నం మూటని !

— మాధవరావు కృష్ణ

కొడుకు విరుచుకు పడ్డాడు. అందరూ అన్నిరకాలుగా హితబోధ చేసినా తన మార్గమేదో, తనకేది సమ్మతమైందో అలాగే నడుచుకుంటాను తప్ప వక్రమార్గంలోకి వెళ్లను ... అని గట్టిగా చెప్పాలనుకున్నాడు...చెప్పలేకపోయాడు. చెప్పితే తనను అసమర్థుడని ఎక్కడ హేళన చేస్తారేమోనని అతని భయం.

ఆ సమర్థత అతనికి చాలా దూరం.

బలరామయ్య అసమర్థతను ఇంట్లోనే కాదు బయటవాళ్ళు కూడా ఎత్తిపొడిచేవారు. అయితే అతని సమర్థతను, మంచితనాన్ని, నీతినిజాయితీని అంచనా వేసేవారు కాదు. ఎవరెక్కువ తింటే వాడే బలవంతుడన్న రోజులవి.

బలరామయ్య ఎలాగో కొడుకును డిగ్రీ చదివించాడు.

అమ్మాయిల పెళ్ళిళ్ళు... కొడుక్కి ఉద్యోగం... కోడలు రావడం జరిగాయి.

ఆ సమయంలోనే స్వరాజ్యలక్ష్మి జబ్బుపడి మంచం ఎక్కింది. ఖరీదైన మందులు అతనికి దూరం... కొడుకు జీతానికి కోడలు ఖర్చులకు ఎక్కడా పొంతన ఉండేది కాదు. అతనికి వచ్చిన జీతం అప్పులవాళ్ళ అసలుకు, వడ్డీలకు సరిపోయేది. కొడుకును అడగలేడు... ఆత్మాభిమానం అడ్డు పడేది.

ఎలాగైతేనేం ఓడిపోయాడు భార్య విషయంలో. గెలుపుకు అతనికి అంత దూరం. అది ఎప్పుడో గ్రహించాడు. అందుకే చనిపోయిన భార్య గురించి బాధపడేవాడు కాదు. ఈ బాధల బందీలనుండి విముక్తి కలిగిందనుకున్నాడు.

వయసు పెరిగింది. భార్య పోయింది. రిటైరయ్యాడు. చీటికిమాటికి చిరాకుపడడం అలవాటయింది. ఆవిడే ఉంటే ఇతని తిట్లను, చిరాకును ఓపిగ్గా భరించేదేమో... కానీ ఆవిడ అదృష్టవంతురాలైంది. ఇంట్లో కోడలు... కూతురు కాదు కదా వాటిని భరించి అతనికి సపర్యలు చేయడానికి.

ఇప్పుడనిపిస్తుంది బలరామయ్యకు తను వయసులో ఉన్నప్పుడు అందరిలాగ ఎందుకు ఉండలేదా అని. ఏం లాభం... అంతా అయిపోయింది.

అతనికి అన్నీ దూరంగా ఉండేవి... ఏవీ దగ్గరకు వచ్చేవికాదు. నాటి దగ్గరకు వెళ్ళాలనే ప్రయత్నం కూడా చేయలేదు. అందుకే అవి అతనికి అందకుండా దూరంగా వెళ్ళిపోయాయి.

*  *  *

గతంలోంచి వాస్తవానికి వచ్చాడు బలరామయ్య.

కొడుకు, కోడలు, పిల్లలు అందరూ సెకండ్ షో సినిమాకు బయలుదేరుతున్నారు కాబోలు హడావిడిగా ఉన్నారు.

సినిమా చూసి చాలా రోజులైంది. కొడుకు బయటకు వస్తే ఆ మాటే చెప్పాడు.

"ఈ వయసులో సెకండ్‌షో సినిమాలేమిటి. కళ్ళు జబ్బులు వస్తాయి."

అది కోడలు సమాధానం.

రోజూ వెళుతున్నానా... ఒకసారి చూడగానే కళ్ళు పోతాయా ... ఒళ్ళు మండింది. అయినా గట్టిగ అడగలేదు తనను కూడా తీసుకెళ్ళమని. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక కోరిక పుట్టింది బలరామయ్యకు.

ఏవీ తినకూడదని కోడలు చెప్పింది. డాక్టరు చెప్పినవి కొన్ని, కోడలు కల్పించినవి మరికొన్ని. ఏది ఏమైతేనేం చప్పిడి మెతుకులు తప్ప రుచికరమైన పదార్థాలు ఏవీ నోట్లో పడడం లేదు.

అన్నీ తినాలి... వంటింట్లోకి వెళ్ళాడు.

పాలగిన్నె కనిపించింది. స్టౌ వెలిగించాడు కాఫీ కలుపుకుందామని.

పిల్లలకోసం అప్పుడప్పుడు కోడలు జిలేబి, కారంపూస చేసి డబ్బాల్లో పెట్టడం చూసాడు. అల్మారాలోని డబ్బాలన్ని వెదికాడు. ఒక్కటీ కనిపించలేదు.

నిరాశ కలిగింది. పిల్లలు పాడు చేస్తారని అవన్నీ తీసి కోడలు బెడ్‌రూంలోని ట్రంకు పెట్టెలో ఉంచి తాళాం వేసిందన్న సంగతి బలరామయ్యకు తెలియదు.

అన్నీ తినాలనుకున్నాడు ... ఏవీ అందుబాటులో లేవు.

చిరాగ్గా ఉంది... ఆ చిరాకులో పాలగిన్నె తన్నేసాడు. పాలన్నీ నేల పాలయ్యాయి. పంచదార కలుపుకుని తియ్యతియ్యగా కాఫీ త్రాగాలన్న కోరిక కూడా తీరలేదు.

ఉసూరుమంటూ వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

నిద్ర రావడం లేదు.

వయసు మళ్ళిం తర్వాత సుఖమైన నిద్రకు కూడా నోచుకోలేదు. అన్నీ తనకు కాకుండా దూరంగా పోతున్నాయన్న బాధ.

చివరకు నిద్ర కూడా అతనికి దూరమే.

హాస్పిటలు బెడ్‌మీద ఉన్నాడు బలరామయ్య. నాలుగు రోజుల క్రితం వరండాలో కాలు జారి పడిన బలరామయ్య మంచంమీదే ఉండిపోయాడు. అంతవరకూ అతనిలో దాగి ఉన్న జబ్బులన్నీ బయటకు వచ్చాయి.

డాక్టరు అతన్ని బ్రతికించాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. చివరకు ప్రయత్నం ఫలించలేదన్నట్లుగ పెదవి విరిచాడు.

ఆఖరి ప్రయత్నం కూడా చేసాడు.

ఇంకొక గంటలో తెలివొస్తే గండం గడిచినట్టే.

డాక్టరు కొడుకుతో అంటున్న మాటలు వినిపించాయి బలరామయ్యకు.

ఈ గంట గడిస్తే... వీల్లేదు... ఈగంట దాటకూడదు. ఈ గంటలో అంతవరకు అతనికి దూరంగా వున్న మృత్యువు దగ్గరకు వస్తుంది. రావాలి... అదేకాదు... తనకిన్నాళ్ళూ ఏవేవీ దూరమయ్యాయో అవన్నీ తిరిగి రావాలి... సాధ్యమా...

గడచిన కాలంలో దూరమైన వాటిని దగ్గరకు తీసుకోవాలనుకోవడం తెలివితక్కువతనమే... అవి తిరిగి రానివి... బాధగా ఉంది.

కనీసం ఈ చివరి ఘడియలలో తన కిష్టమైన పదార్థాలు తినాలి... చిన్న కోరిక... ఇంతకంటె మరేవీ దగ్గరకు రావని తెలుసు.

కొడుకు, కోడలను చూసాడు.

"నాకు అన్నీ తినాలని ఉంది." అతి కష్టంగా వచ్చాయి మాటలు బలరామయ్య నోట్లోంచి.

కొడుకు డాక్టరువైపు ఆశ్చర్యంగాచూసాడు.

డాక్టరుకు తెలుసు బలరామయ్య మనస్తత్వం. చాలాసార్లు బలరామయ్య డాక్టరుతో అనేవాడు... చిన్నప్పటి నుండి తన కోరికలు, ఆలోచనలు, నిర్ణయాలు తనకు దూరంగా ఉన్నాయి. ఏ ఒక్కటి దగ్గరకు తీసుకోలేని అసమర్థత నాలో పెరుగుతూ వస్తుంది. వయసయింతర్వాత ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను తనెంత పొరపాటు చేసాను అని. కనీసం మృత్యువు కూడా నేను కోరుకున్న సమయానికి నాదగ్గరకు రావాలి. అది తన దగ్గరకు వస్తుందని తెలియాలి.

డాక్టరు బలరామయ్య కొడుకును బయటకు పంపించాడు.

కొడుకు పది నిముషాల్లో వచ్చాడు. స్వీట్లు, హాట్లు, ఫ్లాస్కులో కాఫీ టేబిలుమీద ఉంచాడు.

బలరామయ్య కళ్ళు తృప్తిగా మెరిసాయి. చుట్టూ చూసాడు. కొడుకు,కోడలు,కూతుళ్ళు, అల్లుళ్ళు అందరూ కన్నీటితో చూస్తున్నారు.

బలరామయ్య చేతులు చాచాడు.

అంతే..

బలరామయ్యకు ఇప్పుడు డాక్టరు, కొడుకు, కోడలు ఇంకా టేబిలుమీదున్న స్వీట్లుగాని కనిపించడంలేదు.

"నాకేం కనిపించడంలేదు" అరవాలనుకున్నాడు. కానీ నోట్లోంచి మాటలు రాలేదు.

అతని చేతులు ఆ పదార్థాలదగ్గర ఆగిపోయాయి.

అవి తనదగ్గరకు రాలేదనీ...

అందరూ గొల్లుమన్నారని కాని...

తెలియదు బలరామయ్యకు.

అన్నీ దూరమైనా అతను కోరుకునే మృత్యువు అతను కోరుకునే టైముకే వచ్చిందన్న సంగతి కూడా తెలియదు.

ఎలా తెలుస్తుంది. .?

అప్పటికే ఆ దూరాన్ని అధిగమించి అక్కడకే చేరుకున్నాడు. ★



నూతన యవ్వనం పొందండి ! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" :— ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం నుండి సాయంత్రం 6–30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,**

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521301 ★ ఫోన్స్ : 522 & 540

ఆంధ్రపత్రిక

దినపత్రికలో

* మన సినిమాలు

* వింత యదార్థం

శీర్షికలు

చూస్తున్నారా ?